# కట్టెల బేరం

'రావు'

★

[ఉదయం అయిదున్నరగంటలవేళ. ట్రంకు రోడ్డుమీంచి బస్‌స్టాండుదగ్గరగా ఒక కట్టెలబండీ వెళుతూవుంటుంది.]

అప్పయ్యసెట్టి—ఎవరోయ్, బండీమీద ? ఈ లు అమ్మకానికేనా ?

బండీవాడు : సిత్తంబాబూ !

అ : అయితే ఎలాగేటి బేరం ?

బం : రూపాయికి అయిదు ముట్టెలండి ! మాంచి కలపండి. అమట్టుగా పొయ్యిలో ఎట్టొచ్చండి !

అ : అదేమిటోయ్ ! మేమే అడితికాడికొస్తే పదేసంటూ నువ్వే చెప్తావు. సగానికిసగం వారా యేమిటోయ్ !

బం : సిత్తమండి బాబయ్యా ! అక్కడికొత్తే ఆ సంగతి యేరండి. మరిగత్తే బండీ అద్దే, మా కూలీ రావద్దా బాబూ ! రేంజీరుబాబుకీ, గార్డు బాబుకీ, వూళ్ళో అదికార్లకీ మామూళ్లు యిస్తేగాని, బాబూ మర్నాటికి మేం యీ యవ్వారం చెయ్యగలమా ?

అ : అదంతా యెందుకూ ? బండీమొత్తం మీద చెప్పు. మొత్తం బండీ అంతా యాభై, అరవైకి ఎక్కువున్నట్టు కనపడవు.

బం : అదేమ్మాటబాబూ ! నూటికి పైమాటే గాని తక్కువకాదండి. మొత్తంగా పెటువులు తీసుకుంటానంటే రెండు తగ్గిస్తాను. పద్దెనిమిదికి తీసుకోండి. వందకి ఒక్కముట్టె తగ్గినా నాకు దమ్మిడీ యియ్యొద్దు.

అ : యిచ్చి బేరాలు ఆడాలిగాని లేనిపోని మాటలెందుకూ ? పదిహేను చేసుకో. యిందులో నీకు యేమిన్నీ నష్టంలేదు. దానికి యిష్టం లేకపోతే నీదారి నీదీ, నాదారి నాదీ.

బం ; తొలిబేరం పెటువులది. పొద్దున్నే బేరం చెడగొట్టుగోడం మంచిదికాదు. నష్టమైనా కానీండి. బండీ ఎక్కడికి తోలమంటారు ?

అ : తొందరపడకు. నీకు మొదటే సొమ్ము యిచ్చివేస్తాను. రెండే రెండు వీధులు తిరిగితే చాలు. నీ బండీ కాళీచేసి పంపిస్తాం. నువ్వు మాత్రం నోరు మెదల్పకూడదు అలాగైతేనే నీకూ, మాకూ కుదురుతుంది.

బం : సిత్తం ; బాబయ్యా. నా డబ్బు నా సేతిలో పడ్డాక మీరేం చేసుకుంటే నాకేటి ? అనాగే కానియ్యండి !

(ఇంతలో భీమన్నసెట్టి వచ్చును)

అ : ఒరే. భీముడూ ! నీకోసమే కాసుక్కూకున్నాను. (అని కొంచెందూరం తీసుకెళ్ళి రహస్యంగా) బండీ బాగా వుందిరా ! పదిహేనుకి

కొన్నా. రెండొంతులు నాదీ, ఒకొంతు నీదీన్నీ. ఏకాడికి తోస్తే ఆకాడికి అమ్మేసి డబ్బువసూలు చెయ్యి. నేను సింతపండు యవ్వారానికి బేగి పోవాల! బండీ ఆ మలుపు తిరిగేసరికి మా చిన్నోడికి పంపిస్తా, వెనకాతల వుండి నీకు లెక్కా-డొక్కా రాయడానికి. పలకర్ర అయిందా, నేదా?

భీ : ఇప్పుడే అయింది అన్నా!

అ : అయితే పద, అయ్యరు ఓటేలో కాఫీ తీస్కుని మరీ పోదాం. (బండీ దగ్గిరికి వచ్చి) ఓయ్ బండబ్బీ, తీస్కో రూపాయిలు! ఒక్క ఒక్కసిటం ఉండు. మావోడు నీ యెనకాల ఒస్తాడు.

బం : (డబ్బు తీసుకుని) సిత్తమండి పెబువులు,

## ౨

[కొత్త వీధిలో కట్టెలబండి. బండి వెనకాల భీమన్నసెట్టీ అప్పయ్యసెట్టి కొడుకు పెన్సిలు, కాగితాలతో]

భీ : కర్రలు కావాలండీ, కర్రలు! నాణెమైన సరుకు. యిలాంటివి మళ్ళీ దొరకబోవు! పసందైన కర్రలు!

ఒకరు : ఎలాగండి సెట్టిగారూ!

భీ : ఓహో! పంతులుగారా! దణ్ణాలు! రూపాయికి మూడుమువ్వెలండి. చాలా కిఫాయిత్తు! ఎగువవీధి డిపోలో రెండు రూపాయలకికూడా యిన్ని కర్రలు రావండి. పాతవీధిలో పది రూపాయిలవి అమ్మేమండి. కావలిస్తే భోగట్టా చేయించవచ్చండి.

ఇంకొకరు : భీమన్నసెట్టిగారు అబద్ధమాడేవారుకారండి! మంచి ఘరానా మనిషి.

మొదటి : అయితే మాకు మంచి మువ్వెలు మూడు రూపాయలకి వేయించండి.

రెండవ : మాకు అయిదింటికి వేయించండి.

మూడవ : మా యింట్లో పెళ్ళీ అవీ వస్తున్నాయి, వర్షం పడితే మరి కలపవంక చూడలేము. మాకో పది రూపాయిలవి వేయించండి.

## ౩

[అప్పయ్యసెట్టి యింటిలో చావడి. ప్రవేశం సెట్టీ, అతని చిన్నకొడుకూ, భీమన్నసెట్టి]

అ : భీమన్నా! చాలా వేగంగానే తేల్చుకుని వచ్చేశావే! నేనూ యిప్పుడే సింతపండు యవ్వారం సెటలుచేసుకునివచ్చా. ఏమాత్రమేమిటి చిన్నోడా!

చిన్నోడు : బండిలో 102 మువ్వెలున్నాయి. రూపాయికి మూడుచొప్పున అమ్మగా ముప్ఫయినాలుగు రూపాయిలు వచ్చాయి నాన్నా!

అ : యియ్యాల యవ్వారం మంచి బేరంతోటే మొదలెట్టింది. దేవుడికి ఒక అంటిపండూ, కన్నంకానీ యిచ్చిరావాలి, మరిగంటే-భీమన్నా! నీ వాటా అయిదూ నువ్వు తీసుకో, తక్కిన సొమ్ము యిలా పడెయ్యి.

భీ : అదేమిటన్నా! నువ్వు పెట్టిన పెట్టుబడి పదిపోనేకాదూ! ఇంకా పందొమ్మిదున్నాయి కదా! నాకు ఆరు రూపాయిల ఐదణాలడబ్బు రావొద్దూ, మనం అనుకున్నప్రకారం!

అ : ఛా, ఛా! ఆవేంమాటలు! సరికి సరి కంటె ఎక్కువలాభం వస్తుందా యెక్కడైనా? నువ్వూ యవ్వారం చేస్తున్నావుగందా! మన లాభం పదిపోనే! నీవంతు అయిదే! కానా లెక్కపెట్టుకో!

భీ : మరి ఆ మిగిలిన నాలుగో!

అ : ఒయి యెర్రిమొగమా! నే పెట్టుబడి పెడితేగదటయ్యా నీకు లాభంవచ్చేది? నా పెట్టుబడికి రొండన్నా వడ్డీ కిట్టొద్దా! ఇక మావాడు నీకు సాయంగా వచ్చి లెక్కా, డొక్కా రాస్తే వాడికి రెండు రూపాయిలన్నా కూలి కిట్టొద్దా?

భీ : అన్నా! ఒక రూపాయన్నా యియ్యి!

అ : నువ్విలాగంటూనే నాకు చిరాకు తెప్పిస్తావు. రెండు వీదులు తిరిగేవో లేదో, రెండు గడియలకి—నీకు పిలిచి అయిదు రూపాయలు చేతిలో పెడితే చాలదేం? ఎల్లెల్లు! ఎవరన్నా యింటే నవ్విపోగలరు.

---